సాక్షి సూర్యాపేట

సోమవారం । 28 । అక్టోబర్ । 2024



ప్రజల కోసం పనిచేస్తున్నారు
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల కోసం పనిచేస్తున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	589.70 అడుగులు
ఇన్‌ఫ్లో	64,472 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	16,138 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	29,394 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	9,967 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	6,173 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	2,400
వరద కాల్వకు	400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	643.80 అడుగులు
ఇన్‌ఫ్లో	702 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	700 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	నిల్
కుడికాల్వకు	నిల్

న్యూస్‌రీల్

మట్టపల్లిలో విశేషపూజలు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం విశేష పూజలు వైభవంగా కొనసాగాయి. ఉదయం ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికిపంచసూక్త విధానంగా పంచామృతాభిషేకం, ప్రత్యేకార్చనలు చేశారు. అనంతరం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీ ప్రహ్లాదయోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. ఆ తర్వాత విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, మధుఫర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో అత్యంత వైభవంగా నిత్య కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్ అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎం అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న అధ్యక్షుడు జెల్లా ప్రసాద్

సూర్యాపేట టౌన్: తెలంగాణ గెజిటెడ్ హెడ్ మాస్టర్స్ (టీజీహెచ్‌ఎం) అసోసియేషన్ జిల్లా కమిటీని ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జెల్లా ప్రసాద్, జనరల్ సెక్రటరీగా పెనుగొండ శ్రీనివాస్, ట్రెజరర్‌గా విడెం వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లుగా వనమాల వెంకటేశ్వర్లు, గాలి వెంకటరమణ, బి.వెంకటేశ్వర్లు, ఏ.రేణుకలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు జెల్లా ప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేన్ ట్రెజరర్ బి.తుకారాం, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఆర్.వీరస్వామి పాల్గొన్నారు.

వైభవంగా సౌరహోమం

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయా సమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపించారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద సత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, ఇంద్రారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

ఊసేలేని 'దిశ'!



సూర్యాపేట కలెక్టరేట్ భవనం

- రెండేళ్లుగా నిర్వహించని అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశాలు
- కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై కొరవడిన సమీక్ష
- ఆసక్తి చూపని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు

భానుపురి (సూర్యాపేట): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సమీక్ష నిర్వహించాల్సిన దిశ (జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం) ఊసే లేకుండా పోయింది. గతంలోనూ మొక్కుబడిగా జరిగిన ఈ సమావేశాలు.. నూతన ఎంపీ బాధ్యతలు స్వీకరించి నాలుగు నెలలు గడిచినా అతీగతి లేకుండా పోయాయి. అసలు ప్రతి మూడు, ఆరు నెలలకు జరగాల్సిన ఈ కమిటీ సమావేశం ఏడాదికి ఒకసారి కూడా జరగడం లేదు. వాస్తవానికి అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు కేంద్ర ప్రభుత్వ నిధులు జిల్లాకు వస్తుంటాయి. అయితే జిల్లాకు అందిన నిధులు, ఆ నిధులతో చేపట్టిన పనులు చర్చించి, తదుపరి అవసరాల కోసం ఈ దిశ కమిటీ సమావేశంలో ప్రతిపాదనలు పంపించాల్సి ఉంటుంది. జిల్లా అభివృద్ధికి ఎంతో కీలకమైన ఈ సమావేశాన్ని దాదాపు రెండేళ్లుగా నిర్వహించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

గతంలోనూ నామమాత్రంగానే..

దిశ కమిటీకి స్థానిక పార్లమెంట్ సభ్యుడు చైర్మన్‌గా, కలెక్టర్ కార్యదర్శిగా ఉంటారు. అయితే సూర్యాపేట దిశ కమిటీ నల్లగొండతో పాటు భువనగిరి పార్లమెంట్ పరిధిలోకి రావడంతో ఇక్కడి స్థానిక నల్లగొండ ఎంపీ చైర్మన్, భువనగిరి ఎంపీ కోచైర్మన్‌గా వ్యవహరించాల్సి ఉంది. కలెక్టర్ సెక్రటరీగా, జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్లు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, ఎంపీపీలతో పాటు పలువురు నామినేటెడ్ సభ్యులు ఉండనున్నారు. గతంలో ఉన్న దిశ కమిటీ రద్దుకాగా.. నూతన కమిటీ ఏర్పాటు ఇంతవరకూ జరగనేలేదు. నల్లగొండ ఎంపీగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గెలుపొందిన తర్వాత అయిదేళ్లకు గాను 2020లో ఒకసారి, 2022లో మరోసారి మాత్రమే దిశ సమావేశాలు నిర్వహించారు.

ప్రతిపాదనలతోనే సమస్యలకు పరిష్కారం..

అయితే ఢిల్లీ స్థాయిలో వచ్చే పనులు, నిధుల విషయంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు పనులు ప్రతిపాదనల విషయంలో జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షల ద్వారా ఎంపీలకు అందిస్తే కేంద్రస్థాయిలో కొంత పర్యవేక్షణ జరిపి సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుంది. దిశ కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా జరిగితే జిల్లాకు కూడా అదేస్థాయిలో నిధులు, పనులు సత్వరం మంజూరయ్యేవి. అధికారులు ఉన్నత స్థాయి ఆదేశాల మేరకు ప్రతిపాదనలు పంపుతున్నా.. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండడం, వాటిని ఢిల్లీస్థాయిలో పర్యవేక్షణ చేయకపోవడంతో జాప్యం జరుగుతోంది. జిల్లాలో ఇప్పటికైనా క్రమం తప్పకుండా దిశ కమిటీ సమావేశాలు నిర్వహించి లోటుపాట్లు సరిదిద్దితే జిల్లా అభివృద్ధిపథంలో ముందుకు వెళ్లనుందని పలువురు అంటున్నారు.

చర్చించాల్సిన అంశాలివే..

దిశ కమిటీ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలన్నింటిపై చర్చించాల్సి ఉంటుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్‌నిధి పథకం కింద రైతులకు మూడువిడతల్లో రూ.6వేలను అందిస్తుంది. అయితే ఈకేవైసీ కారణంగా చాలామంది రైతులకు నిధులు రావడం లేదు. దీంతో పాటు కొత్తగా ఈ పథకంలో చేరేందుకు అవకాశం లేకుండాపోయింది. ఈ సమస్యను ఈ దిశ కమిటీలో చర్చించి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపితే జిల్లాలో రైతాంగానికి మేలు జరుగుతోంది. గ్రామీణ సడక్ యోజన పథకంలో సంస్కరణలు చేపట్టింది. మరో నెలరోజుల్లో ప్రతిపాదనల గడువు ముగియనున్నట్లు తెలుస్తోంది. వీటితో పాటు ఎంపీ ల్యాడ్స్‌తో కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎం ఫసల్ బీమాయోజన, ముద్ర రుణాలు, పీఎం ఆవాస్ యోజన, ఉపాధి హామీ, జలసంరక్షణ వంటి పథకాల అమలుపై నిర్మాణాత్మక చర్చ జరిగితేనే కమిటీ సమావేశం ప్రజలకు ప్రయోజనకరంగా ఉండనుంది.

రోడ్లన్నీ బడాబాబులకు కట్టబెట్టే కుట్ర



మాట్లాడుతున్న గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

- చంద్రబాబు విధానాలే రేవంత్ పాటిస్తున్నారు
- కేసీఆర్ హయాంలోనే అన్ని ప్రాంతాలకు రోడ్లు, విద్యుత్ ఇచ్చాం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేట టౌన్: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నట్టుగానే గ్రామీణ ప్రాంత రోడ్లన్నీ బడాబాబులకు కట్టబెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాన్యులపై ట్యాక్స్ భారం పెట్టేలా తీసుకున్న కేబినెట్ నిర్ణయంపై మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా చంద్రబాబు విధానాలే పాటిస్తున్నారు తప్ప అభివృద్ధి గురించి ఆలోచన చేసే సోయిలేదని విమర్శించారు. ఏ ప్రాతిపదికన రోడ్లు కేటాయిస్తారో పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలోనే అన్ని ప్రాంతాలకు రోడ్లు, విద్యుత్ ఇచ్చామని.. 60 ఏళ్ల నిర్లక్ష్యాన్ని ఎండగట్టి.. కేవలం పదేళ్లలో అద్భుత ప్రగతి సాధించిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీదేనన్నారు.

కేటీఆర్ ఇంటిపై దాడిని ఖండిస్తున్నాం

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇంటిపై పోలీసుల దాడిని ఖండిస్తున్నామని జగదీష్‌రెడ్డి అన్నారు. రేవంత్ బంధువుల ఇళ్లలో కూడా చాలా జరుగుతున్నాయని, భూములు ఆక్రమిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయని దీనిపై పోలీసులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కేటీఆర్ సెక్యూరిటీ లేకుండా ప్రజల్లోకి బయటకు వస్తారని, సీఎం రేవంత్‌రెడ్డి సెక్యూరిటీ లేకుండా రావాలని సవాల్ విసిరారు. చట్టం అనుమతి లేకుండా ఎవరి మీద పడితే వారి మీద దాడి చేస్తామంటే ఊరుకోమన్నారు. సమావేశంలో ఒంటెద్దు నర్సింహారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, నెమ్మాది భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచమంతా కమ్యూనిస్టు పార్టీ వైపు చూస్తోంది



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

అర్వపల్లి: దోపిడీకి వ్యతిరేకంగా కష్టజీవులకు అండగా నిరంతరం పోరాడుతున్న కమ్యూనిస్టు పార్టీ వైపు ప్రపంచమంతా చూస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలో ఆదివారం జరిగిన సీపీఎం మండల 8వ మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రపంచంలో కమ్యూనిస్టు దేశాలు కుల, మత బేధాలు లేకుండా సంపదను సమానంగా అందరికి అందిస్తూ తీవ్రవాదానికి తావు లేకుండా ప్రజాపాలన కొనసాగిస్తున్నాయని చెప్పారు. అమెరికా లాంటి సామ్రాజ్యవాద దేశాలు తమ గుత్తాధిపత్యం కోసం చిన్నచిన్న దేశాలను రెచ్చగొడుతూ వాటిమధ్య యుద్ధాలను తీసుకొస్తుందని విమర్శించారు. భారతదేశంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను కట్టబెడుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. రానున్న రోజుల్లో హామీలను అమలు చేయకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఈ సభలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, చెరుకు ఏకలక్ష్మి, పులుసు సత్యం, బుర్ర శ్రీనివాస్, కందాల శంకర్‌రెడ్డి, మండల కార్యదర్శి శ్రీనివాస్, కుమార్, అవిలయ్య, వెంకన్న, అబ్బులు, యాదగిరి, రాజయ్య, సైదులు, లక్ష్మమ్మ, వినయ్ పాల్గొన్నారు.

మార్కెటింగ్ అధికారితో ఫోన్ ఇన్



పత్తి, ధాన్యం అమ్మకాల్లో ఇబ్బందులు ఎదువుతున్నాయా. పంటలకు మద్దతు ధర దక్కడం లేదా.. తూకాల్లో మోసం జరుగుతోందా. ప్రభుత్వ కేంద్రాల్లో కొర్రీలు పెట్టి కాంటా వేయడం లేదా. అయితే మీ సమస్యను నేరుగా జిల్లా మార్కెటింగ్ అధికారికి తెలియజేయండి. రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను ప్రభుత్వ యంత్రాంగానికి తెలియజేసేందుకు 'సాక్షి' ఈ నెల 29వ తేదీన జిల్లా మార్కెటింగ్ అధికారి సంతోష్‌కుమార్ తో ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. రైతులు నేరుగా జిల్లా మార్కెటింగ్ అధికారితో ఫోన్‌లో మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.



సంతోష్‌కుమార్, జిల్లా మార్కెటింగ్ అధికారి

తేది. 29.10. 2024 మంగళవారం
సమయం : ఉదయం 11.00 నుంచి 12.00 గంటల వరకు

దయల్ చేయాల్సిన ఫోన్ నంబర్ :
83747 19707

దశల వారీగా సౌకర్యాలు కల్పిస్తున్నాం

- భక్తుల వసతుల కోసం రూ.1.37 కోట్లు ఖర్చు చేశాం
- యాదాద్రి సన్నిధిలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



మంత్రి సురేఖకు శ్రీస్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు దశల వారీగా సౌకర్యాలు కల్పిస్తున్నామని, రూ.1.37కోట్లతో యాదాద్రి ఆలయంలో సౌకర్యాలు కల్పించే కార్యక్రమాలు చేపట్టామని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. యాదాద్రీశుడిని ఆదివారం మంత్రి.. కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తుల చెంత అష్టోత్తర పూజలు నిర్వహించిన అనంతరం మంత్రి సురేఖ, కుటుంబ సభ్యులకు అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. ఈఓ భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం, శ్రీస్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆలయంలో భక్తులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత భక్తులకు సౌకర్యాలను కల్పించాలనే లక్ష్యంతో చాలా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ప్రధానంగా ఆలయ మాడ వీధిలో రూ.30లక్షలతో దాతల ద్వారా జర్మనీ హంగర్స్ ఏర్పాటు చేశామన్నారు. రూ.20లక్షలతో మాడ వీధిలో భారీ ఎల్‌ఈడీని, విష్ణు పుష్కరిణిలో రూ.6లక్షలతో స్నాన సంకల్ప పూజా కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. రూ.3.50లక్షలతో కొబ్బరికాయల మొక్కుల కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు. వృద్ధులు, వికలాంగుల కోసం ఇప్పటికే రెండు బ్యాటరీ వాహనాల సౌకర్యం కల్పించామన్నారు. అంతే కాకుండా స్పెషల్ లిఫ్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొండపైనే అదనపు ప్రసాద కౌంటర్లను పెట్టామన్నారు. కొండపైకి ఆటోలను పునరుద్ధరించి, 400 కుటుంబాలను ఆదుకుంటున్నామన్నారు. నిత్యాన్నదానం ద్వారా రోజూ 600 నుంచి 1000 మంది భక్తులకు ప్రసాదం అందజేస్తున్నామన్నారు. విమాన గోపురానికి బంగారు తాపడం కోసం ఇప్పటికే 12 కిలోల బంగారాన్ని స్మార్ట్ క్రియేషన్స్‌కు అప్పగించినట్లు తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగులు సామాజిక సేవలో పాల్గొనాలి



సామూహిక జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు

హుజూర్‌నగర్: రిటైర్డ్ ఉద్యోగులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం భవనంలో ఈనెలలో జన్మించిన రిటైర్డ్ ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉంచుకోవడం ఎంతవరకు సబబని ఆయన ప్రశ్నించారు. ఉద్యోగుల కోరికలు పరిష్కరించమని అడిగితే ప్రభుత్వానికి ఆదాయం లేదని కుంటి సాకులు చెప్పడం సరికాదన్నారు. వచ్చే డిసెంబర్ నాటికి ఉద్యోగులకు నగదు రహిత హెల్త్‌కార్డులు అందే అవకాశం ఉందన్నారు. అనంతరం జన్మదిన వేడుకలు జరుపుకున్న పెన్షనర్లు అల్వాల చంద్రయ్య, వెంకటరంగయ్య, జగన్నాథచార్యులు, థెరిస్సాలను శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంబాబు, పూర్ణచంద్రారెడ్డి, మొయినుద్దీన్, దేవదానం, ఎస్.వెంకటేశ్వరరావు, తాటి ప్రభాకర్‌రెడ్డి, ఎంఎస్‌ఎన్ రాజు, రఘునాథ్, పీఎల్‌ఎస్ రెడ్డి పాల్గొన్నారు.

హరహర మహాదేవ శంభోశంకర



కళాకారుల నృత్య ప్రదర్శనల నడుమ శివలింగాన్ని ర్యాలీగా తీసుకొస్తున్న నిర్వాహకులు



జ్ఞానప్రసూన బాబా ఆధ్వర్యంలో శివలింగానికి మహా రుద్రాభిషేకం చేస్తున్న అర్చకులు

- హుజూర్‌నగర్‌లో మట్టి శివలింగానికి వైభవంగా మహారుద్రాభిషేకం
- పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తజనం
- శివన్నామస్మరణతో మార్మోగిన పట్టణం

హుజూర్‌నగర్: హరహర మహాదేవ శంభో శంకర, ఓం నమఃశ్శివాయ అంటూ శివనామస్మరణతో హుజూర్‌నగర్ పట్టణం మారుమోగింది. ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఎస్ఎస్‌పీ క్యాంపు ఉన్నత పాఠశాల ఆవరణలో ఎనిమిది అడుగుల మట్టి శివలింగానికి మహా రుద్రాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం పట్టణంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి రుద్రాక్షలతో అలంకరించిన శివలింగాన్ని ప్రదర్శనగా గాంధీపార్క్ సెంటర్ వరకు తీసుకెళ్లారు. ఈ ర్యాలీలో మంగళ వాయిద్యాలు, గుత్తికోయలు, గంగిరెద్దుల ప్రదర్శనలు, భక్తబృందం నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గురూజీ జ్ఞానప్రసూన బాబా ఆధ్వర్యంలో శివలింగానికి జల, ఫల, పుష్ప, విభూది, కుంకుమ, సింధూరం, ఆవు నెయ్యి, కిస్మిస్, జీడిపప్పు, పండ్ల రసాలు, మారేడు దళాలు, నవగ్రహ దినుసులతో వేదమంత్రాల నడుమ మాహారుద్రాభిషేకం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అభిషేకాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు. వాడవాడలా ఏర్పాటు చేసిన మైకులలో శివయ్య భక్తిగీతాలు, వేదమంత్రాలు వినిపించాయి. దీంతో పట్టణమంతా సందడి వాతావరణం నెలకొంది. పూజా ప్రారంభ కార్యక్రమంలో తొలుత హుజూర్‌నగర్ జడ్జి జిట్టా శ్యాంకుమార్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, వైస్‌చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి శరణ్య దంపతులతో పాటు నిర్వాహకులు, మహిళలు, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మనశ్శాంతి

ఆధ్యాత్మికతతోనే ప్రతి మనిషికి మనశ్శాంతి లభిస్తుందని అమ్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు, గురూజీ జ్ఞానప్రసూన బాబా అన్నారు. మహారుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ఆకలితో ఉన్న ఒకరికి అన్నం పెడితే.. భగవంతుడు మీకు తోడుగా ఉండి ఎన్నో కలుగజేస్తాడనిపేర్కొన్నారు. మీరు చేసినసేవే మిమ్ములను కాపాడుతుందన్నారు. మూఢనమ్మకాలతో మనుషుల మధ్య అంతరాలు ఉండకూడదన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని ఆయన కోరారు.



పూజలు చేస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, హుజూర్‌నగర్ జడ్జి శ్యాంకుమార్ దంపతులు

సర్కార్ బడులు బలోపేతమయ్యేలా..

- మండల విద్యాధికారులకు ప్రత్యేక శిక్షణ
- 29న హైదరాబాద్‌లో ఒక్క రోజు కార్యక్రమం
- ఉత్తర్వులు జారీచేసిన విద్యా శాఖ
- జిల్లా నుంచి హాజరు కానున్న 23 మంది ఎంఈఓలు



నాగారంలో విద్యార్థుల ప్రమాణాల స్థాయిని పరిశీలిస్తున్న డీఈఓ అశోక్ (ఫైల్)

నాగారం: సర్కార్ బడుల బలోపేతంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఇందులో భాగంగా ఇటీవల ప్రతి మండలానికి ఒక ఎంఈఓను నియమించింది. వీరందరికీ ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు పాఠశాల విద్యా శాఖ కార్యాచరణ రూపొందించింది. ఈ నెల 29న హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లో ఉన్న కుమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో శిక్షణ నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యా శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా నుంచి 23 మంది ఎంఈఓలు ఈ శిక్షణకు హాజరుకానున్నారు. ఎంఈఓలు శిక్షణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని డీఈఓలకు విద్యా శాఖ అధికారులు ఆదేశాలు ఇచ్చారు.

పర్యవేక్షణకు ప్రాధాన్యం

ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 1 నుంచి 5 తరగతుల విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఎఫ్‌ఎల్‌ఎన్ (ఫండమెంటల్ లిటరసీ న్యూమరసీ) పేరుతో తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లోని 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు అభ్యసనాభివృద్ధి కార్యక్రమం (లిప్)ను ఉన్నతి పేరుతో అమలు చేస్తున్నారు. పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతను పెంచేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలు పాఠశాల స్థాయిలో సక్రమంగా అమలయ్యేలా ఎంఈఓలు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. పర్యవేక్షణ వివరాలను పాఠశాల విద్యా శాఖ యాప్‌లో నమోదు చేయడంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. గతంలో కాంప్లెక్స్ పాఠశాల హెచ్‌ఎం, మండల నోడల్ అధికారి (ఎంఎన్ఓ), మండల విద్యాధికారి (ఎంఈఓ) వ్యవస్థ అమలులో ఉండేది. అప్పట్లో ఒక్కో ఎంఈఓకు రెండు నుంచి ఆరు మండలాలకు అదనపు బాధ్యతలు ఉండడంతో సరైన పర్యవేక్షణ చేయలేక పోయారు. ఎంఎన్ఓలు పనిచేస్తున్న సీనియర్ జీహెచ్‌ఎంలను ఎంఈఓలుగా నియమించారు. పాఠశాలల పర్యవేక్షణ, విద్యా ప్రమాణాల పెంపు, పరిపాలన విధానం తదితర అంశాలపై ఎంఈఓలకు ఉన్నతాధికారులు ఒక రోజు శిక్షణ నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధంచేశారు.

శిక్షణకు హాజరయ్యేలా ఆదేశాలు ఇచ్చాం



జిల్లాలో ఉన్న 23 మంది ఎంఈఓలు ఈ నెల 29న హైదరాబాద్‌లో నిర్వహించే శిక్షణకు హాజరయ్యేలా ఆదేశాలు ఇచ్చాం. పాఠశాలల పర్యవేక్షణ, విద్యా ప్రమాణాల పెంపు, పరిపాలన విధానం తదితర అంశాలపై ఎంఈఓలకు శిక్షణ నిర్వహిస్తున్నారు.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

క్లుప్తంగా

బడుగు శ్రీరాములుకు అబ్దుల్ కలాం ఎక్స్‌లెన్స్ పురస్కారం


శ్రీరాములుకు పురస్కారం అందజేస్తున్న వేణుగోపాలచారి తదితరులు

చౌటుప్పల్: పట్టణ కేంద్రానికి చెందిన ప్రముఖ విద్యావేత్త బడుగు శ్రీరాములు ఏపీజే అబ్దుల్‌కలాం ఎక్స్‌లెన్స్ పురస్కారానికి ఎంపికయ్యారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి, ప్రముఖ సంఖ్యా శాస్త్రవేత్త దైవజ్ఞశర్మ చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. శ్రీరాములుకు పురస్కారం లభించడం పట్ల చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన పలువురు హర్షం వ్యక్తం చేశారు.

భువనగిరి వాసికి డాక్టరేట్


పాదరాజు నరేష్

భువనగిరి: పట్టణానికి చెందిన పాదరాజు నరేష్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి స్టాటిస్టిక్స్ విభాగంలో డాక్టరేట్ లభించింది. 'అనాలసిస్ మోడలింగ్ అండ్ ప్రిడిక్షన్ అక్యురసి ఆఫ్ టొబాకో ప్రైసెస్ ఇన్ ఇండియా' అనే అంశంపై డాక్టర్ ఎం. రాఘవేందర్ పర్యవేక్షణలో నరేష్ పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా నరేష్ పరిశోధనకు సంబంధించిన అంశాలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ప్రస్తుతం ఆయన విజ్ఞాన భారతి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. నరేష్‌కు డాక్టరేట్ రావడం పట్ల విద్యావేత్తలు, కుటుంబ సభ్యులు, మిత్రులు ఆనందరం వ్యక్తం చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

చౌటుప్పల్ రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామ స్టేజీ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మోజిగూడెం గ్రామ స్టేజీ వద్ద శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి గాయపడి ఉన్నాడని స్థానికులు పోలీసులు సమాచారం అందించగా.. పోలీసులు ఘటనా స్థలం వద్దకు వెళ్లి వెంటనే అతడిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందని, అతడికి మతిస్థిమితం సరిగ్గా లేనట్లుగా గుర్తించామని పోలీసులు తెలి పారు. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టినట్లు పోలీ సులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథ కుమార్ తెలిపారు.

రేవంత్‌రెడ్డి ప్రజల కోసం పనిచేస్తున్నారు

- భవిష్యత్ తరాలను కాపాడేందుకే మూసీ ప్రక్షాళన
- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి
- మూసీ పరివాహక రైతుల ఆత్మీయ సమ్మేళన సభకు హాజరైన ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం


అభివాదం చేస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం

శాలిగౌరారం, మోత్కూరు, అడ్డగూడూరు: గడిచిన పదేళ్లలో మాజీ సీఎం కేసీఆర్ తన కుటుంబం కోసం పాటుపడితే, నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల కోసం పనిచేస్తున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మూసీ ప్రక్షాళన కార్యక్రమానికి మద్దతుగా శాలిగౌరారం మండలం గురుజాల, అడ్డగూడూరు మండలం మానాయికుంట గ్రామాల మధ్య మూసీ నదిపై ఉన్న బ్రిడ్జిపై ఆదివారం నిర్వహించిన మూసీ పరివాహక రైతుల ఆత్మీయ సమ్మేళన సభకు తుంగతుర్తి, నకిరేకల్ ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశంలతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రూ.7.50లక్షల కోట్ల అప్పుల్లోకి తెలంగాణ రాష్ట్రం నెట్టివేయబడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన 10 నెలల కాలంలోనే అన్ని ఒడిదుడుకులను అధిగమిస్తూ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. పరిశ్రమల వ్యర్థాలతో విషపూరితంగా మారిన మూసీ నదిని ప్రక్షాళన చేసి భవిష్యత్ తరాల మనుగడను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుంటే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తూ కాలం గడుపుతున్నాయన్నారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రతిపక్షాల విష ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దన్నారు. నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం కడితే ఒక్కసారి వచ్చిన వరదలకే కూలిపోయే స్థితికి చేరుకుందన్నారు. మూసీ ప్రక్షాళన కార్యక్రమానికి మద్దతుగా మూసీ పరివాహక ప్రాంత ప్రజలు, రైతులు లక్ష మందితో త్వరలో సభ నిర్వహిస్తామని ప్రకటించారు.

జనసంద్రంగా మూసీ నది బ్రిడ్జి..

మూసీ పరివాహక రైతుల ఆత్మీయ సమ్మేళన సభతో మూసీ నదిపై ఉన్న గురుజాల-మానాయికుంట హైలెవల్ బ్రిడ్జి జనసంద్రంగా మారింది. బ్రిడ్జితో పాటు బ్రిడ్జికి ఇరువైపులా సుమారు కిలోమీటరు పొడవు ఉన్న అప్రోచ్ రోడ్డు సైతం జనంతో కిక్కిరిసిపోయాయి. శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, చౌటుప్పల్ సీఐ వెంకటేశ్వర్లు నేతృత్వంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. అడ్డగూడురు వైపు నుంచి వచ్చిన వాహనాలను మానాయికుంట శివారులో గట్టుసింగారం రోడ్డు వైపు, శాలిగౌరారం వైపు నుంచి వచ్చిన వాహనాలను గురుజాల శివారులో తుడిమిడి రోడ్డు వైపు పార్కింగ్ చేయించారు. ఈ సభకు తుంగతుర్తి నియోజకవర్గంలోని శాలిగౌరారం, అడ్డగూడూరు, మోత్కూరు మండలాలకు చెందిన సుమారు 15వేల మందికి పైగా తరలివచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జ్ఞానసుందర్, కాసోజు శంకరమ్మ, నూక కిరణ్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు కందాల సమరంరెడ్డి, పోలేబోయిన లింగయ్య, వంగాల సత్యనారాయణ, సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి, అడ్వకేట్ యుగంధర్, నాయకులు కొమ్ము సత్యానారాయణ, మాజీ సర్పంచ్ జోజి, పైళ్ల సోమిరెడ్డి, బాలెంల సైదులు, విద్యాసాగర్, మేడబోయిన శ్రీను, కడారి శ్రీశైలం, బొమ్మగాని లక్ష్మయ్య, అంజమ్మ, వీరలక్ష్మి, పద్మ తదితురులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నాయి: నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నాయని అన్నారు. తెలంగాణ సెంటిమెంట్‌తో రాజకీయం చేసిన పార్టీలు నేడు ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నాయన్నారు. మూసీ నది విషపూరితంగా మారిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తన నివేదికల్లో వెల్లడించిందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు మూసీ ప్రక్షాళనను అడ్డుకోవడం మూర్ఖత్వమని, మూసీ ప్రక్షాళనను వ్యతిరేకించే వారిని గ్రామాలకు రాకుండా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మూసీ నదికి పునరుజ్జీవం తీసుకొవచ్చేందుకు పాటుపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుగా నిలబడాలన్నారు.

పదేళ్ల ఫాసిస్టు పాలన అంతమొందింది: తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో తెలంగాణను నిలువునా దోచుకోవడంతో పాటు మూసీ నది, బిక్కేరులోని ఇసుకను మింగిన ఇసుకాసురులను ప్రజలు తన్ని తరిమేశారని, దీంతో ఫాసిస్టు పాలన అంతమొందిందని అన్నారు. మూసీ నది అభివృద్ధి పేరుతో రూ.25 వేల కోట్లు మింగిన గత బీఆర్‌ఎస్ పాలకుల పాపం పండక తప్పదన్నారు. మూసీ నదిని ప్రక్షాళన చేసి రాష్ట్ర ప్రజలకు మేలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తుంటే ఎందుకు విషప్రచారం చేస్తున్నారో ప్రజలకు బీఆర్‌ఎస్ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ వద్ద మూసీలో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు మునిగితే మానాయకుంటకు వచ్చే సరికి శవాలై తేలేవారని విమర్శించారు. తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయడమే తన ఏకైక లక్ష్యమన్నారు.

బుద్ధ వంశ గ్రంథం ఆవిష్కరణ


బుద్ధ వంశ గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగార్జునసాగర్: బుద్ధవనం కన్సల్టెంట్, ఫ్లీచ్ ఇండియా సీఈఓ ఈమని శివనాగిరెడ్డి పాలీభాష నుంచి తెలుగులోకి అనువదించిన బుద్ధవంశ గ్రంథాన్ని తెలంగాణ పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆవిష్కరించారు. బుద్ధవనం ప్రాజెక్టు మెంటార్ చెన్నూరు ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. సమాజ రుగ్మతలను రూపుమాపేందుకు బుద్ధుని బోధనలే శరణ్యమని అన్నారు. ఈ సందర్భంగా మహాబోధి బుద్ధవిహార, బుద్ధవనం ప్రాజెక్టు రూపశిల్పి ఆంజనేయరెడ్డి కృషిని మంత్రి కొనియాడారు. బుద్ధ వంశ గ్రంథాన్ని తెలుగులోకి అనువదించిన ఈమని శివనాగిరెడ్డిని, అదే గ్రంథానికి వ్యాఖ్యానాన్ని రచించిన తియ్యగూడ సీతారామిరెడ్డిని మంత్రి సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ బౌద్ధబిక్షువులు పూజ్య ఇట్టిక, పూజ్యానంద, పూజ్యసుగతానంద, పూజ్య సంఘపాల, బౌద్ధోపాసకులు సంబటూరి వీరనారాయణరెడ్డి, సుదన్‌రెడ్డి, శ్యామసుందర్‌రావు, తెలంగాణ బీఎస్ఐ అధ్యక్షుడు పరంధాములు పాల్గొన్నారు.

భువనగిరిలో హత్య కలకలం !

- ఆస్తి కోసం భర్తను భార్య హత్య చేసినట్లు సోషల్ మీడియాలో వైరల్..?

భువనగిరి క్రైం: ఆస్తి కోసం హైదరాబాద్‌కు చెందిన వ్యాపారిని అతడి భార్య తన ప్రియుడితో కలిసి భువనగిరి ప్రాంతంలో హత్య చేసినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. హైదరాబాద్‌కి చెందిన వ్యాపారి రమేష్‌కుమార్‌ను అతడి భార్య నిహారిక, ఆమె ప్రియుడు నిఖిల్ కలిసి రూ.8కోట్ల ఆస్తి కోసం భువనగిరి ప్రాంతంలో హత్యచేసి హైదరాబాద్ మీదుగా కర్ణాటకలోని ఊటీ వద్ద కాఫీ ఎస్టేట్‌లో తగులబెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. కాఫీ తోటలో సగం కాలిన మృతదేహాన్ని కర్ణాటక పోలీసులు గుర్తించి మర్డర్‌పై కూపీలాగినట్లు తెలుస్తోంది. నిహారికది యాదాద్రి భువనగిరి జిల్లా అని, ఆమె ప్రియుడు నిఖిల్‌ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా అని సమాచారం. వీరికి హర్యానాకు చెందిన రాణా అనే వ్యక్తి సహకరించాడని, అతడిని కర్ణాటక పోలీసులు అదుపులో తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై భువనగిరి పోలీసులను వివరణ అడుగగా.. తమకెలాంటి సమాచారం లేదని, అసలు ఇలాంటి ఘటన భువనగిరిలో చోటుచేసుకోలేదని తెలిపారు.

అవమాన భారంతో వ్యక్తి ఆత్మహత్య

- మృతదేహంతో బంధువుల ధర్నా


యగ్గడి శ్రీనివాస్ (ఫైల్)

పెన్‌పహాడ్: స్నేహితుడి డబ్బు వాడుకున్నావని అవమానపర్చడంతో వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని మాచారం గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మచారం గ్రామానికి చెందిన బొల్లక జానయ్య, సైదమ్మ భార్యాభర్తలు. వీరు పెన్‌పహాడ్ మండల కేంద్రానికి చెందిన శెనగాని సైదులు వద్ద రూ.50వేలు అప్పుగా తీసుకున్నారు. కొద్దిరోజుల తర్వాత అట్టి డబ్బులను సైదులుకు ఇచ్చి రమ్మని భర్త జానయ్యతో పాటు అతడికి తోడుగా గ్రామానికి చెందిన యగ్గడి శ్రీనివాస్(45)ని సైదమ్మ పంపింది. కానీ వారు డబ్బులను సైదులుకు చెల్లించ లేదు. కొద్దిరోజుల తర్వాత సైదులు సైదమ్మను అప్పు విషయమై అడగగా.. తన భర్తతో ఎప్పుడో పంపించానని, అప్పు ముట్టినట్లు కాగితం కూడా తిరిగి ఇచ్చావని ఆమె సైదులుకు తెలిపింది. తనకు ఎలాంటి డబ్బు ఇవ్వలేదని అప్పు ఇచ్చినట్లు రాసిచ్చిన పత్రం తన వద్దనే ఉందని సైదులు చెప్పడంతో సైదమ్మ భర్త జానయ్యతో పాటు శ్రీనివాస్‌ను పిలిచి పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన శ్రీనివాస్ ఆదివారం తన వ్యవసాయ భూమి వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పక్కన కౌలు రైతు భూక్య నరసింహా శ్రీనివాస్ మృతదేహాన్ని చూసి అతడి భార్య జానకమ్మకు సమాచారం ఇచ్చాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు బొల్లక జానయ్య, బొల్లక సైదమ్మ, బొల్లక రామయ్య, సైదులు, బొల్లక కొమురయ్య, బొల్లక బక్కయ్యపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ ఆంగోతు యాదగిరి తెలిపారు.

న్యాయం చేయాలని ధర్నా..

మృతుడి బంధువులు మృతదేహంతో సైదమ్మ ఇంటి ముందు ధర్నా నిర్వహించారు. అప్పు డబ్బులతో ఎలాంటి సంబంధం లేనప్పటికీ పది మందిలోకి పిలిచి అవమానపర్చడంతోనే శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు ఆరోపించారు. ఘటనా స్థలానికి సూర్యాపేట రూరల్ ఎస్ఐ బాలునాయక్, చివ్వెంల ఎస్ఐ కనకరత్నం చేరుకొని ధర్నాను విరమింపజేశారు.

విద్యుదాఘాతంతో హార్వెస్టర్ డ్రైవర్ మృతి


దేవ్‌డి దీపక్ (ఫైల్)

అర్వపల్లి: హార్వెస్టర్ వాహనానికి ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికి గురై డ్రైవర్ మృతిచెందాడు. ఎస్ఐ సీహెచ్. బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన రూపని నరేష్ తన హార్వెస్టర్‌ను నడిపించడానికి ఒరిస్సా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా బాపన్‌పల్లి గ్రామానికి చెందిన దేవ్‌డి దీపక్(24), దేబాసి బిశ్వాస్‌ను డ్రైవర్లుగా నియమించుకున్నాడు. శనివారం ముగ్గురు కలిసి జాజిరెడ్డిగూడెం శివారులో కొత్తగూడెం వెళ్లే రోడ్డులో వరి చేను కోసేందుకు హార్వెస్టర్‌ను తీసుకెళ్లారు. రాత్రి తిరిగి గ్రామానికి వస్తుండగా.. కొత్తగూడెం రోడ్డులో 11కేవీ విద్యుత్ వైర్లు హార్వెస్టర్‌కు తగిలాయి. దీంతో హార్వెస్టర్ పైనే ఉన్న దీపక్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. నరేష్, బిశ్వాస్ కిందకు దూకడంతో ప్రాణాలతో బయటపడ్డారు. పోలీసులు దీపక్ మృతదేహానికి సూర్యాపేట జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు అవివాహితుడు. హార్వెస్టర్ యజమాని రూపని నరేష్ అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా దానిని నడిపించడం వలనే ప్రమాదం జరిగిందని ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

యువకుడిపై మారణాయుధాలతో దాడి


సందీప్

పాలకవీడు: యువకుడిపై మారణాయుధాలతో ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటన పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గా సమీపంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు గ్రామానికి చెందిన వెచ్చా సందీప్ జాన్ పహాడ్ దర్గా వద్ద కిరాణా దుకాణం నిర్వహిస్తూ కుటుంబంతో సహా అక్కడే నివసిస్తున్నాడు. నేరేడుచర్ల బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. ఆదివారం సాయంత్రం సందీప్ తన ఇంట్లో నిద్రిస్తుండగా జాన్‌పహాడ్ గ్రామానికి చెందిన జహంగీర్ మరో ఇద్దరితో కలిసి సందీప్ ఇంట్లోకి చొరబడి అతడిపై కత్తులతో విచక్షణారహితంగా దాడి చేసి అక్కడి నుంచి పారిపోయారు. కత్తిపోట్లకు గురై సందీప్ స్పృహ కోల్పోవడంతో కుటుంబ సభ్యులు మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ లక్ష్మీనర్సయ్యను సంప్రదించగా.. దాడి జరిగినట్లు జరిగిన సమాచారం తెలిసిందని, కానీ ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. పాత గొడవల కారణంగానే ఈ దాడి జరిగి ఉండవచ్చని, దీనిపై విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారును ఢీకొట్టిన లారీ.. స్టాఫ్ నర్సు మృతి

చివ్వెంల(సూర్యాపేట): లారీ అదుపుతప్పి కారును ఢీకొట్టడంతో స్టాఫ్ నర్సు మృతిచెందింది. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని ఖాసీంపేట గ్రామ శివారులో హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటలోని తిరుమల నగర్‌కు చెందిన పగిడిమర్రి అన్నారాణి(57) సూర్యాపేట మండలం ఇమాంపేట గ్రామ శివారులోని సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ కాలేజీలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తోంది. రోజుమాదిరిగానే ఆదివారం తన కారులో డ్రైవర్ సంపత్‌రెడ్డితో కలిసి అన్నారాణి విధులకు వెళ్తుండగా.. చివ్వెంల మండలం ఖాసీంపేట గ్రామ శివారులో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై యూటర్న్ తీసుకుంటుండగా.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు వెనకాల కూర్చున్న అన్నారాణి తలకు బలమైన గాయాలు కాగా చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ హస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కారు డ్రైవర్ సంపత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి. వెంకట్ రెడ్డి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

భువనగిరి క్రైం: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా.. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన భువనగిరి పట్టణంలో ఆదివారం జరిగింది. యాదగిరిగుట్ట మండలం గుండ్లపల్లికి చెందిన వల్లపు కరణ్‌కుమార్(25), జనగామకు చెందిన దున్నపోతుల ప్రశాంత్ ఆదివారం బైక్‌పై స్వర్ణగిరి దేవాలయానికి వెళ్లారు. అక్కడి నుంచి సమీపంలోని రేణుకా ఎల్లమ్మ గుడిలో ఫంక్షన్‌కు హాజరై తిరిగి వెళ్తుండగా.. భువనగిరి పట్టణంలోని ఐటీఐ కళాశాల వద్ద బైక్‌ను తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కరణ్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందగా ప్రశాంత్‌కు తీవ్ర గాయాలు కావడంతో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కరణ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

న్యాయం చేయాలని రాస్తారోకో


నకిరేకల్ ఆస్పత్రి ఎదుట రాస్తారోకో చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

నకిరేకల్: సూర్యాపేట జిల్లా కుడకుడ గ్రామం సమీపంలోని జంగాలగూడేనికి చెందిన తుర్పాటి చరణ్(16) శనివారం రాత్రి బైక్‌పై వెళ్తూ శాలిగౌరారం మండల పరిధిలోని గురజాల-మానాయికుంట గ్రామాల మధ్యన మూసీ నది బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన రైతు సమ్మేళన వేదికను ఢీకొని మృతిచెందాడు. చరణ్ మృతదేహాన్ని నకిరేకల్ ఏరియా ఆస్పత్రిలోని పోస్టుమార్టం గదిలో భద్రపర్చగా.. ఈ ఘటనపై కేసు నమోదు చేయకుండా పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆదివారం ఆస్పత్రి ఎదుట రాస్తారోకో చేశారు. అధికార పార్టీకి చెందిన నాయకులు మూసీ ప్రక్షాళనకు మద్దతుగా సమ్మేళన సభ నిర్వహిస్తూ మూసీ బ్రిడ్జిపై ఎలాంటి ప్రమాద సూచికలు పెట్టకుండా సభా వేదిక ఏర్పాటు చేసి తమ కుమారుడి మృతికి కారణమయ్యారని చరణ్ తల్లిదండ్రులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, నకిరేకల్ ఎస్ఐ లచ్చిరెడ్డి ఆస్పత్రి వద్దకు చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

వీధి వ్యాపారులపైకి దూసుకెళ్లిన బొలేరో వాహనం

- పలువురికి గాయాలు


క్షతగాత్రులను 108 వాహనంలో మిర్యాలగూడకు తరలిస్తున్న సిబ్బంది

నేరేడుచర్ల: వీధి వ్యాపారులపైకి బొలేరో వాహనం దూసుకెళ్లడంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం రాత్రి నేరేడుచర్లలో జరిగింది. నేరేడుచర్ల పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ నుంచి గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామానికి వెళ్తున్న బొలేరో వాహనం నేరేడుచర్ల ప్రధాన కూడలిలోకి రాగానే ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బొలేరో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న వీధి వ్యాపారుల పైకి దూసుకెళ్లడంతో పలువురు పండ్ల వ్యాపారులకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించడంతో క్షతగాత్రులను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నేరేడుచర్లకు చెందిన ముత్యాల వెంకటాచారి, ఎన్ఎస్‌పీ రిటైర్డ్ ఉద్యోగి మల్లయ్య, హుసానాబాద్‌కు చెందిన మల్లికార్జున్‌చారి, హుజూర్‌నగర్ మండలంలోని వేపల సింగారం గ్రామానికి చెందిన హుస్సేన్, సబియా, మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన బాణావత్ కోమటికి గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసమైంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ద్విచక్ర వాహనదారుడు రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి

తిప్పర్తి: మండలంలోని ఇండ్లూరు గ్రామంలో ఆదివారం అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతిచెందాడు. ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇండ్లూరు గ్రామానికి చెందిన ఏపూరి నాగరాజు(16) పదో తరగతి ఫెయిల్ కావడంతో మేకలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజుమాదిరిగా ఆదివారం కూడా మేకలను మేపేందుకు గ్రామ శివారులోకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. మేకలు మాత్రమే ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టాగా.. గ్రామంలోని పురాతన చర్చిలో నాగరాజు మృతదేహం కనిపించింది. మృతుడి నోట్లో నుంచి నురగలు రావడంతో అతడి తండ్రి కాలేబు అనుమానాస్పద మృతిగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సాగర్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల


రెండు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్: సాగర్ ప్రాజెక్టు నుంచి ఆదివారం రెండు రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. సాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 589.70 అడుగుల మేర నీరు ఉంది. స్పిల్‌వే మీదుగా 16,138 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా 29,394 క్యూసెక్కులు మొత్తం 45,532 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ, ఏఎమ్మార్పీ వరద కాల్వలకు 18,940 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

అభాగ్యులకు అందని ప్రభుత్వ సాయం

- ఏడేళ్ల కిత్రం చెరువులో మునిగి మృతిచెందిన ఐదుగురు చిన్నారులు
- ఒక్కో కుటుంబానికి రూ.3లక్షల ఎక్స్‌గ్రేషియా, డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇస్తామన్న అప్పటి కలెక్టర్ గౌరవ్ ఉప్పల్
- తక్షణ సాయంగా ఒక్కో కుటుంబానికి రూ.లక్ష అందజేత
- మిగిలిన సాయం అందక ఇబ్బందులు పడుతున్న బాధిత కుటుంబాలు


మృతిచెందిన చిన్నారుల చిత్రపటాలతో బాధిత కుటుంబ సభ్యులు

కేతేపల్లి: కన్న బిడ్డలను కోల్పోయిన అభాగ్యులు ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా కోసం ఏళ్ల తరబడిగా ఎదురు చూస్తున్నారు. వివరాలు.. కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన పసల లూర్థురాజు, పసల రాజు, పసల ఆరోగ్యయ్య అన్నదమ్ములు. వీరు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. 2017 ఏప్రిల్ 25న వేసవి సెలవుల్లో పసల లూర్థురాజు ఇద్దరు కుమార్తెలు, పసల రాజు కుమారుడు, కుమార్తె, పసల ఆరోగ్యయ్య కుమారుడు మొత్తం ఐదుగురు చిన్నారులు స్థానికంగా ఉన్న నిమ్మలమ్మ చెరువులో ఈత నేర్చుకునేందుకు వెళ్లారు. వీళ్లంతా 13 ఏళ్ల లోపు వారే. వీరిలో ఒక్కరికి కూడా ఈత రాదు. చెరువులో లోతైన గుంతలు ఉండటంతో ప్రమాదవశాత్తు ఒకరి తర్వాత ఒకరు చెరువులోని నీటిలో మునిగి మృత్యువాత పడ్డారు. విషయం తెలుసుకున్న నాటి నల్లగొండ జిల్లా కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద ప్రభుత్వం నుంచి మృతులకు ఒకొక్కరికి రూ.3లక్షల చొప్పున ఎక్స్‌గ్రేసియా, డబుల్‌బెడ్ రూం ఇల్లు అందజేస్తామని ప్రకటించారు. తక్షణమే ఒక్కో బాధిత కుటుంబానికి రూ.లక్ష చొప్పున అందజేశారు. మిగిలిన డబ్బులను పది రోజుల్లో బాధిత కుటుంబాలకు అందజేస్తామని హామీ ఇచ్చి వెళ్లిపోయారు. ఈ ఘటన జరిగి ఏడేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం ప్రకటించిన ఆర్థికసాయం బాధిత కుటుంబాలకు అందలేదు. పరిహారం కోసం మండల స్థాయి అధికారులతో పాటు ఆర్డీఓ, జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులను కలసి తమగోడు విన్నవించినా పట్టించుకునేనాథుడే లేకుండా పోయారని బాధిత కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వం ప్రకటించిన సాయం అందేలా చూడాలని వేడుకుంటున్నారు.